క్లుప్తంగా

సింగిల్‌విండో చైర్మన్ రాజీనామా



సింగిల్‌విండో చైర్మన్ గోపాల్‌రెడ్డికి వీడ్కోలు పలుకుతున్న సిబ్బంది

సి.బెళగల్: సి.బెళగల్ సింగిల్‌విండో చైర్మన్ గోపాల్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. గురువారం ఆయన స్థానిక కార్యాలయానికి చేరుకుని తన రాజీనామా పత్రాన్ని సొసైటీ సీఈఓ రవికుమార్ రెడ్డికి అందజేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఓటమి చెందడంతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు గోపాల్ రెడ్డి తెలిపారు. రాజీనామ అనంతరం సీఈఓ, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సీబీ గోవిందరెడ్డి, కార్యాలయ సిబ్బంది గోపాల్ రెడ్డిని శాలువా, పూలమాలతో సన్మానించి వీడ్కోలు పలికారు. 2013 సంవత్సరంలో జరిగిన సింగల్‌విండో ఎన్నికలలో గెలుపొందిన గోపాల్‌రెడ్డి ఇప్పటి వరకు అధ్యక్షుడిగా కొనసాగారు. దాదాపు 11 సంవత్సరాల పాటు సేవలు అందించడంతో పలువురు పెద్దలు ఆయనను అభినందనలు తెలిపారు.

గరిష్ట వేతనం పొందేలా పనులు చేయండి



కంబదహాల్లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: గ్రామాలలో ఉపాధి హామీ కూలీలు గరిష్ట వేతనం పొందేలా పనులు చేయాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో కూలీలు చేపట్టిన కాలువ పూడికతీత పనులను తనిఖీ చేశారు. కూలీలతో ఈఓఆర్డీ మాట్లాడుతూ.. ఉదయం ఏడు గంటలకు పనులకు చేరుకోవాలని, కొలతల మేరకు పనులు చేసి దినసరి గరిష్ట వేతనం పొందాలన్నారు. దేవిధంగా మండల ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది, కూలీలు చేసిన పనులకు తగిన వేతనాలు అందేలా చూడాలన్నారు. ఉపాధిహామీ పథకం కింద పండ్లతోటల పెంపకానికి ఔత్సాహికులైన రైతులను గుర్తించి, ఉద్యాన వన పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఎఫ్ఏలు, సీనియర్ మేట్‌లు ఉన్నారు.

గూడూరులో 49 మి.మీ వర్షపాతం

గూడూరు రూరల్ : గూడూరులో బుధవారం ఉదయం నుంచి గురువారం తెల్లవారుజాము వరకు 49 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పట్టణంలో ఎడతెరపి లేకుండా వర్షం కురిసిందని, అయితే ఎక్కడా మద్దిమిద్దెలు, గుడిసెలు కూలినట్లు సమాచారం అందలేదని వెల్లడించారు.

అన్యాక్రాంతమైన స్థలాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: పెద్దపాడు గ్రామంలోని వడ్లోని వంక అన్యాక్రాంతమైన స్థలాన్ని కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ, మండల కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. గురువారం కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో సీపీఎం మండల కమిటీ సమావేశం కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్లోని వంక భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించడంతో వర్షపునీరు దళితవాడలోకి, ప్రభుత్వ హాస్టల్‌లోకి వస్తుందన్నారు. నీరు ప్రవహించడంతో హై స్కూల్ ప్రహరీ కూలిపోయిందన్నారు. స్థలం కబ్జాపై అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శీను, గోపి, రామాంజనేయులు, సోమేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్‌పై అవగాహన



ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్, కంట్రోల్ అసెస్మెంట్ అధికారులతో పీహెచ్‌సీ సిబ్బంది

కల్లూరు: టీబీ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా ఇన్‌ఫెక్షన్ ప్రివెన్షన్, కంట్రోల్ అసెస్మెంట్ టీం రాష్ట్ర అధికారులు డాక్టర్ నీరద, మైక్రోబయాలజిస్ట్ సందీప్ గురువారం కల్లూరు పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధికారులు ఇన్‌ఫెక్షన్ ప్రివెన్షన్‌పై వైద్య సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మోతీలాల్ నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సురేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బుడిబుడి అడుగులు.. బడివైపు

- పునఃప్రారంభమైన పాఠశాలలు
- ఉత్సాహంగా బడులకు వెళ్లిన పిల్లలు
- మొదటిరోజే అడ్మిషన్లు ప్రారంభించిన హెచ్‌ఎంలు



భూపనపాడు పాఠశాలలో విద్యార్థులతో ఎంపీడీఓ, ఎంఈఓ





సి.బెళగల్ లో పాఠశాలకు చేరుకుంటున్న చిన్నారులు, గురుకుల ప్రవేశాలలో ప్రతిభ చాటిన పోలకల్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సి.బెళగల్: దాదాపుగా నెలన్నర రోజుల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునఃప్రారంభం కావడంతో మండలంలోని గ్రామాలలోని పిల్లలు వడివడిగా పాఠశాలలకు వెళ్లారు. మొదటి రోజు పాఠశాలలకు చేరుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించి, పాఠశాల విద్యా విధానాన్ని తెలియజేశారు. మండలంలోని పోలకల్ గ్రామ రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మొదటి రోజు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రేవుల శ్రీనివాసులు, టీచర్లతో కలిసి విద్యార్థులు తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అదేవిధంగా వివిధ పాఠశాలల్లో గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలలో ప్రతిభ కనరపచిని విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన టీచర్లను సత్కరించారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని కొటారుమిట్టా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మీనాక్షి, ఉపాధ్యాయుడు వేంకటేశ్వర్లుతో కలిసి వీధులలో పర్యటించి అర్హతగల బాలలను పాఠశాలలో చేర్పించుకున్నారు. పలుకుదొడ్డి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం హనుమంతు, ఉపాధ్యాయుడు రాము మొదటి రోజు ఎనిమిది మంది విద్యార్థులను పాఠశాలలో చేర్చుకున్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం

పాణ్యం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలు గురువారం పనఃప్రారంభమయ్యాయి. దీంతో పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడాయి. ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ, ఎంఈఓ కోటయ్య భూనపాడు పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వేసవి సెలవుల్లో ఎలా గడిపారనే ఆరా తీశారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

2024–25విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ఎంఈఓ కోటయ్య తెలిపారు. మండలానికి మొత్తం 26,128 పాఠ్యపుస్తకాలు, 32వేల నోట్ పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. మండల కేంద్రం నుంచి ఆయా పాఠశాలలకు ఆటోల ద్వారా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

స్టూడెంట్ కిట్లు పంపిణీ

ఓర్వకల్లు: ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన స్టూడెంట్ కిట్లను గురువారం పాఠశాలలకు పంపిణీ చేసినట్లు ఎంఈఓ ఓంకార్‌యాదవ్ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలానికి తొలి దశ కింద మొత్తం 55,272 పాఠ్యపుస్తకాలు, 45,520 నోట్ పుస్తకాలు, 6,782 స్కూల్ బ్యాగ్‌లు, 4,830 బెల్టులు మంజూరైనట్లు తెలిపారు. ఇంకా యూనిఫాం, బూట్లు, డిక్షనరీలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యా కానుక కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జోషులవాట్స్, సీఆర్‌పీలు నాగమద్దయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పాఠశాలలు

కల్లూరు: ప్రభుత్వ పాఠశాలలు గురువారం పున: ప్రారంభమయ్యాయి. మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి ప్రధానోపాధ్యాయులకు కిట్లను ఎంఈఓ–1 శ్రీనివాసులు, ఎంఈఓ–2 వనజకుమారి అందిచారు. ఈ మేరకు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్‌ను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు.



పలుకుదొడ్డి పాఠశాలలో బాలలను చేర్చుకుంటున్న హెచ్‌ఎం హనుమంతు, టీచర్ రాము



పోలకల్ రెగ్యులర్ స్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాసులు



పాణ్యం మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం



కల్లూరులో విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రారంభమైన ప్రజాపాలన

కల్లూరు : ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించడంతో ప్రజాపాలన ప్రారంభమైందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో గురువారం కల్లూరు అర్బన్ మాదవీ నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లెల రాజశేఖర్, పాలకొల్లు సుధాకర్ రెడ్డి, రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షుడు శ్రీరాములు, విజయుడు తదితరులు పాల్గొన్నారు

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): గడియారం ఆసుపత్రి సమీపంలోని ప్రభుత్వ ఉర్దూ బాలుర పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న ప్రీ మెట్రిక్ మైనారిటీ బాలికల వసతి గృహంలో ప్రవేశం పొందేందుకు 6, 7, 8, 9, 10వ తరగతి మైనారిటీ విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సునీల్‌కన్నా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 48 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న మైనారిటీ విద్యార్థినులు మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుంచి బోనోఫైడ్ సర్టిఫికెట్, తహసీల్దార్ నుంచి ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు వసతి గృహ సంక్షేమాధికారి 9491653323 నంబర్‌ను సంప్రదించాలన్నారు. .

ముస్లిం మైనార్టీ విద్యార్థులకు అవకాశం

కర్నూలు సిటీ: స్థానిక మైనారిటీ గురుకుల జూనియర్ కాలేజీలో మిగిలిపోయిన సీట్లను ముస్లిం, మైనారిటీ విద్యార్థులతో భర్తీ చేయనున్నామని కాలేజీ ప్రిన్సిపాల్ సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 9 సీట్లు, బైపీసీలో 12 సీట్లు,సీఈసీలో 22 సీట్లు మిగిలాయని, ఎలాంటి ప్రవేశ పరీక్ష రాయకున్నా ఆసక్తి ఉన్న మైనా ర్టీ విద్యార్థులు సర్టిఫికెట్లతో ఈనెల 18వ తేదీ లోపు నేరుగా కాలేజీకి వస్తే ప్రవేశం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8712625080 నంబరును సంప్రదించాలన్నారు.

అనారోగ్యకర జీవనశైలి వల్లే క్యాన్సర్



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): అనారోగ్యకర జీవనశైలి వల్లే క్యాన్సర్ వస్తోందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. వైద్యశాల ఆవరణలోని స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రిలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారిణి హేమలత పర్యవేక్షణలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊబకాయం, వ్యాయామం లేకపోవడం, మద్యపానం, ధూమపానం వంటి అలవాట్ల వల్ల క్యాన్సర్ వస్తోందన్నారు. సరైన అలవాట్లను అలవరచుకుంటే ఈ వ్యాధిని నివారించవచ్చన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ ఆడవారికి రొమ్ములో గడ్డలు, గర్భాశయం ముఖద్వార క్యాన్సర్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. క్యాన్సర్ వచ్చినప్పుడు బరువు తగ్గే అవకాశం ఉంటుందని, ఈ లక్షణాలను బట్టి వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కుటుంబంలో ఒకరికి క్యాన్సర్ సోకితే ఆ కుటుంబం మొత్తం మానసిక కుంగుబాటుకు లోనవుతుందన్నారు. క్యాన్సర్ వ్యాధి సోకిన వారు, కుటుంబసభ్యులకు మానసిక ధైర్యం ఎంతో అవసరమన్నారు. జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారిణి హేమలత మాట్లాడుతూ 40 మంది చొప్పున మూడు రోజుల పాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్రెస్ట్ క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణకు హాజరైన వారికి డాక్టర్ నిఖత్ నస్రీన్, డాక్టర్ మంజూషా, డాక్టర్ తులసి బాయి వివరించారు. కార్యక్రమంలో స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, ప్రివెంటివ్ అంకాలజి నోడల్ ఆఫీసర్ డాక్టర్ నాగరాజు, స్టేట్ నోడల్ అధికారి రవీంద్రారెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌సీఎం చర్చి మహోత్సవం



ప్రార్థనలు చేస్తున్న ఆర్‌సీఎం చర్చి నిర్వాహకులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని జొహరాపురంలో ఉన్న పునీత అంథోని ఆర్‌సీఎం చర్చి మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఎన్నికైన పీఠాధిపతులు రెవరెండ్ గోరంట్ల జ్వానేష్ పాల్గొని దివ్యబలి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 4 నుంచి 12 వరకు ప్రతి రోజు దివ్యబలిపూజ, పరిశుద్ధ జపమాల, నవదిన ప్రార్థనలు చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ భక్తిప్రవత్తులతో మెలగాలన్నారు. అంతకు ముందు ఆర్‌సీఎం దేవాలయం నుంచి జొహరాపురం వరకు భక్తిశ్రద్ధలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జొహరాపురం విచారణ గురువు ఆంథోని, ఫాదర్ గిల్‌బర్ట్, భక్తులు పాల్గొన్నారు.

గురుకులంలో సీట్లు పెంచాలి



గురుకుల సొసైటీ జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీదేవికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు సిటీ: గురుకుల పాఠశాలల్లో సీట్లు పెంచి, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ ప్రవేశాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సీక్యాంపులోని గురుకుల సొసైటీ కో–ఆర్డినేటర్ కార్యాలయం ఎదుట వారు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.షాబీర్ బాషా, ఉపాధ్యక్షులు ఎస్.శరత్‌కుమార్ మాట్లాడుతూ గురుకుల, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో సీట్లను పెంచి పేద విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం గురుకుల సొసైటీ కో–ఆర్డినేటర్ శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. ఆందోళనలో ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు అభి, అఖిల్, సాయి, రాహుల్, రమేష్, సుంకన్న, కళ్యాణ్, హరీష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బొలేరో డ్రైవర్ దుర్మరణం



లారీని ఢీకొట్టిన బొలేరో వాహనం

ఓర్వకల్లు: మండల పరిధిలోని సోమయాజులపల్లె ఘాట్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొలేరో వాహన డ్రైవర్ దుర్మరణం చెందాడు.కర్ణాటక రాష్ట్రంలోని దారువాడ జిల్లా, ఎరుగుప్ప గ్రామానికి చెందిన హోసమని మంజునాథ్(26) కేఏ 34సీ 6409 నంబర్ బొలేరో వాహనంలో పచ్చి మిరపకాయలతో నంద్యాలకు బయలుదేరాడు. మార్గమధ్యలో సోమయాజులపల్లె ఘాట్‌లో ముందుగా వెళ్తున్న లారీని బొలేరో వేగంగా ఢీకొంది. దీంతో డ్రైవర్ మంజునాథ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుని తండ్రి హనుమంతప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.


కలెక్టర్, జేసీలకు ఏపీ ఎన్‌జీఓ నేతల అభినందనలు

కర్నూలు(అగ్రికల్చర్): సార్వత్రిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యలను ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ నేతలు మర్యాద పూర్వకంగా కలసి అభినందించారు. ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి, కార్యదర్శి జవహర్ లాల్, నగరశాఖ కార్యదర్శి ఎంసీ కాశన్న ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి హృదయరాజు వివిధ ఉద్యోగ సంఘాల నేతలు కలెక్టర్, జేసీలను సత్కరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలు, ఉద్యోగుల భద్రతకు పెద్దపీట వేయడం పట్ల కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించారనే కారణంతో 100 మందికిపైగా ఉద్యోగులు, అధికారులపై వేసిన సస్పెన్షన్‌ను ఎత్తి వేసి పోస్టింగ్ ఇవ్వాలని అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి కోరారు.

పత్తి ఓబులయ్యకు రాజాబాబు అవార్డు

కర్నూలు కల్చరల్: సీనియర్ కళాకారుడు, సాహితీవేత్త టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య గురువారం రాజాబాబు స్మారక అవార్డును అందుకున్నారు. హైదరాబాదు ఫిలింనగర్‌లోని ఫిల్మ్ కల్చరల్ సెంటర్‌లో జరిగిన అవార్డు ప్రదాన కార్యక్రమంలో సినీ నిర్మాతలు మోహన్‌దాస్, బి.గోపాల్, ప్రసన్నకుమార్, సినీ నటి అన్నపూర్ణ, సంగీత నాటక అకాడమీ మాజీ అధ్యక్షులు గుమ్మడి గోపాలకృష్ణ, సంస్థ కన్వీనర్ భగీరథ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ప్రముఖ సినీ టీవీ నటుడు రాజాబాబు స్మారక అవార్డు పేరిట ఏటా ముగ్గురు సినీనటులు, ముగ్గురు టీవీ నటులు, ముగ్గురు రంగస్థల నటులకు అవార్డులను ప్రదానం చేస్తుండగా రంగస్థల నటుల విభాగంలో పత్తి ఓబులయ్య అవార్డును అందుకున్నారు.

ఎంపీటీసీ పదవికి రాజీనామా



రాజీనామా పత్రాన్ని సీఈఓకు అందిస్తున్న ఎంపీ బస్తిపాడు నాగరాజు

కర్నూలు (అర్బన్): కర్నూలు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన బస్తిపాడు నాగరాజు తన ఎంపీటీసీ పదవికి రాజీనామా చేశారు. ఆయన ఇప్పటివరకు కర్నూలు మండలం పంచలింగాల–1 మండల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడిగా కొనసాగుతూ వచ్చారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కర్నూలు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించడంతో గురువారం జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డిని కలసి తన ఎంపీటీసీ పదవికి సంబంధించిన రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ పంచలింగాల–1 ఎంపీటీసీ రాజీనామాను ఆమోదించామని, ఈ స్థానం ఖాళీ ఏర్పడిన విషయాన్ని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌కు తెలియజేస్తామని అన్నారు.

పాణ్యం ఎమ్మెల్యేకు విద్యుత్ శాఖ ఎస్ఈ అభినందనలు

కర్నూలు(అగ్రికల్చర్): పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం కర్నూలు నగరంలోని శాసనసభ్యురాలి నివాసానికి వెళ్లి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆసుపత్రిలో ఇన్ఫెక్షన్ రేటు తగ్గించేందుకు చర్యలు



సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డితో చర్చిస్తున్న డాక్టర్ టి.నీరద

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇన్ఫెక్షన్ రేటు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు టీబీ ముక్త భారత్ కన్సల్టెంట్ డాక్టర్ టి.నీరద తెలిపారు. గురువారం ఆమె కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనిక్, పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, డెంటల్, లేబర్ రూమ్, ఏఆర్‌టీ, క్యాజువాలిటీ, ఏఎంసీ, టీబీ సెంటర్, బ్లడ్‌బ్యాంక్, డయాగ్నోస్టిక్ బ్లాక్‌లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో రోగుల నుంచి వైద్యులకు, సిబ్బందికి, ఇతర రోగులకు, వారి సహాయకులకు ఇన్‌ఫెక్షన్ సోకకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా మాస్కులు, గ్లౌజులు ధరించాలని, చేతులు తరచూ శానిటైజ్ చేసుకోవాలని చెప్పారు. బయోమెడికల్ వ్యర్థాలను సూచించిన రంగుల డబ్బాల్లోనే వేయాలని, వాటిని భద్రంగా కేటాయించిన గదికి తీసుకెళ్లి ఉంచాలన్నారు. ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందకుండా ఆసుపత్రిలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, ఏఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయిలతో ఆమె చర్చించారు.

జూలై 1న ఎల్‌హెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



అంబేడ్కర్ చిత్రపటం ముందు నివాళి అర్పిస్తున్న లంబాడీ నేతలు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లంబాడీ హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని జూలై 1న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కైలాస్‌నాయక్ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం నేషనల్ గోర్ బంజారా సమ్మేళన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కైలాస్‌నాయక్ మాట్లాడుతూ 'మా తండాలో మా రాజ్యం, మేము ఎంత మందిమో మాకు అంత వాటా' నినాదంతో 1997 జూలై 1న ఎల్‌హెచ్‌పీఎస్ ఆవిర్భవించిందన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా ఉన్న బంజారా జాతి ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. వేడుకలకు జిల్లాలోని లంబాడీ మేధావులు, పెద్దలు, విద్యార్థులు కదలి రావాలని కోరారు. సమావేశంలో నాయకులు నేణావత్ రామునాయక్, సేవలాల్ నాగరాజునాయక్, రామాంజనేయులు నాయక్, భాషా నాయక్, శ్రీను నాయక్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె బకాయిలపై కొరడా



అద్దె బకాయిదారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న అద్దె షాపుల బకాయిలపై జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి.భూపతిరావు దృష్టి సారించారు. సక్రమంగా చెల్లించకుండా బకాయిలు ఉన్న షాపులను గురువారం స్టేడియం సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. కోడుమూరు నియోజకవర్గం పరిధిలోని గూడూరు పట్టణంలో కె.వి.కె. (క్రీడా వికాసా కేంద్రం) వాణిజ్య సముదాయంలో బకాయిలు ఉన్న షాపులను తనిఖీ చేసి అక్కడికక్కడే బకాయిలు వసూలు చేశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తున్న కిందిస్థాయి ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ మాట్లాడుతూ ఇక ప్రతి నెలా స్పోర్ట్స్ అథారిటీ నిర్వహణలో నిర్వహిస్తున్న షాపులపై తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అద్దె సక్రమంగా చెల్లించాలన్నారు. మొండి బకాయిలు ఉంటే నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. త్వరితగతిన బకాయిలు చెల్లించాలని లేకుంటే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు



కలెక్టర్‌ను కలసిన ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

కర్నూలు (సెంట్రల్): కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి గురువారం కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. బొకేలను అందజేసి జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. కాగా జిల్లా అభివృద్ధి, సంక్షేమ పనులకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

కర్నూలు (టౌన్): స్థానిక నగరపాలక కార్యాలయంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజను గురువారం సాయంత్రం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కలిశారు. కార్యాలయానికి తొలిసారిగా వచ్చిన ఎమ్మెల్యేకు మున్సిపల్ అధికారులు బొకే ఇచ్చి సాదరంగా ఆహ్వానం పలికారు. కల్లూరు వార్డుల్లో తాగునీటి సమస్య, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె సూచించారు.